క్లుప్తంగా

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మాళమల్లేశ్వరస్వామి

హొళగుంద: దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు స్వామి వారికి ఉదయాన్నే అభిషేక పూజలు, సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతితో పాటు నిత్యపూజలు శాస్త్రోక్తంగా జరిపించారు. స్థానిక, వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వారికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆస్పరి మఠంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

విరిగిన స్తంభం.. పొంచి ఉన్న ప్రమాదం



కోగిలతోట రోడ్డులో ఎల్లెల్సీపై గూళ్యం బ్రిడ్జ్ వద్ద విరిగిన విద్యుత్ స్తంభం

హొళగుంద: కోగిలతోట రోడ్డులోని దిగువ కాలువపై గూళ్యం బ్రిడ్జ్ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ స్తంభం పైభాగం విరిగి ప్రమాదకరంగా మారింది. దీంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని రైతులు, అటు వైపు తిరిగే వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో పనుల కోసం వెళ్లే వారితో ఈ దారి రద్దీగా ఉంటోంది. పెద్ద గాలి వీస్తే విరిగిన స్తంభం తీగలతో సహా కింద పడే ప్రమాదముందని రైతులు పేర్కొంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులు సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

గుండమ్మ హంతకులను శిక్షించాలి



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గంగుమాల శోభన్‌బాబు

ఆదోనిటౌన్: మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలో దళిత మహిళ గుండమ్మను ట్రాక్టర్‌తో తొక్కి చంపిన కిరాతకులను వెంటనే అరెస్టు చేయాలని అంబేడ్కర్ ఇండియా మిషన్ రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ గంగుమాల శోభన్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపకులు పి.వి. సునీల్‌కుమార్ (ఐపీఎస్) ఆదేశాల మేరకు మృతురాలు గుండమ్మ కుటుంబ సభ్యులు, కుమారుడు కిషోర్, కుమార్తె శృతి, కోడలు ఉషలను పరామర్శించారు. హత్యకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంబేడ్కర్ ఇండియా మిషన్ అండగా నిలుస్తుందని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా అంబేడ్కర్ ఇండియా మిషన్ కార్యదర్శి కేశవులు, నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్, సైనికల్ దళ్ కన్వీనర్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్లెల్సీలో వ్యర్థాలను తొలగించాలి

ఎమ్మిగనూరుటౌన్: తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)లో పేరుకుపోయిన వ్యర్థపదార్థాలను తొలగించాలని రాయలసీమ ప్రజాసంఘాల ఐక్య వేదిక కన్వీనర్ టీచర్ నాగన్న, విద్యార్థి సంఘాల నాయకులు కృష్ణ, సురేంద్ర, ఖాజలు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయా సంఘాల నాయకులు ఎల్లెల్సీ కాలువలో పేరుకయిన వ్యర్థాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. తుంగభద్ర డ్యాం నుంచి నీరు విడుదల చేయన్నారని, ఆ నీటినే పట్టణ వాసులకు తాగునీటి అవసరాలకు వినియోగించనున్నారని తెలిపారు. ప్రస్తుతం కాలువలో చెత్తా చెదారం పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. కాలువకు నీరు విడుదలైతే ఆ నీరు కలుషితమయ్యే ప్రమాదం వుందని, తద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వీరేష్,వెంకటేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజలు వినతులను సమర్పించవచ్చని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు వెల్లడించారు.

బిల్లు చెల్లింపు.. మారింది చూడు!

- విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో మార్పులు
- యూపీఐలకు చెక్ పెట్టిన ఆర్‌బీఐ
- ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌లో చెల్లించాలంటున్న అధికారులు
- 75 శాతం ఆన్‌లైన్‌లోనే చెల్లిస్తున్న వినియోగదారులు

రిజర్వ్ బ్యాంక్ సూచన మేరకు విద్యుత్ సంస్థలు బిల్లుల చెల్లింపును తమ అధికారిక వెబ్‌సైట్, యాప్‌లో మాత్రమే చెల్లించాలని ప్రకటించాయి. ఈ మేరకు వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. మారిన పరిస్థితులకనుగుణంగా ఇప్పటి వరకు 75 మంది యూపీఐల ద్వారానే బిల్లులు చెల్లిస్తున్నారు. ఫోన్‌పే, గూగుల్, అమేజాన్ తదితర యూపీఐల ద్వారా కాకుండా సంస్థ అధీకృత వెబ్‌సైట్, లేదా బిల్‌డెస్క్‌లో చెల్లించాలని సూచిస్తోంది.

ఆలూరు రూరల్: విద్యుత్ బిల్లులను ఇకపై సంస్థకే నేరుగా చెల్లించాలని ట్రాన్స్‌కో ప్రకటించింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌లో మాత్రమే బిల్ పేమెంట్ చేయాలని స్పష్టం చేసింది. యూపీఐ యాప్‌లైన గూగుల్ పే,ఫోన్ పే, పేటీఎం ఇతర వాటిలో బిల్లు చెల్లించే ఆప్షన్‌ను నిలిపివేసినట్లు వెల్లడించింది. విద్యుత్ కార్యాలయానికి నేరుగా వెళ్లి చెల్లిస్తే మేలని ఆ శాఖ అధికారులు వినియోగదారులకు సూచిస్తున్నారు. ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లో ఎల్‌టీ-1 నుంచి ఎల్‌టీ-5 వరకు మొత్తం 76,716 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

ఆర్‌బీఐ నిబంధనలు..

సమయపాలన పాటిస్తూ గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి కరెంటు బిల్లులు కట్టే పద్ధతికి కాలం చెల్లింది. ఆన్‌లైన్ వాడకం పెరగడం, యూపీఐల వినియోగం అధికమవడం, వాటిలో పలురకాల బిల్లుల చెల్లింపులకు అవకాశముండటంతో క్షణాల్లో వాటి ద్వారా నిన్నటి వరకు బిల్లులు చెల్లించగలిగారు. ఎల్‌టీ సర్వీసులు అధిక భాగం బిల్లులు మొత్తం ఆన్‌లైన్‌లోని యూపీఐ ద్వారా చెల్లిస్తున్నారు. మొదట్లో లావాదేవీలను ప్రోత్సహించాలని యాప్‌లో సర్వీసు చార్జీలు వసూలు చేసేవారు కాదు. కానీ గత ఏడాది నుంచి నామమాత్రపు చార్జీలను యూపీఐ యాప్ నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. అయితే జూలై 1 నుంచి యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లింపులకు లైసెన్స్ అవసరమని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయా యాప్‌ల యాజమాన్యాలు లైసెన్స్ పొందేందుకు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో ఆర్బీఐ ఉత్తర్వుల మేరకు బిల్ పేమెంట్ ఆప్షన్ తొలగించేశారు.



ఆలూరులో విద్యుత్ మీటర్ బిల్లు తీస్తున్న మీటర్ రీడర్,



ఆలూరులోని విద్యుత్ చెల్లింపుల కేంద్రం

కారణం ఇదీ..

ఆన్‌లైన్ చెల్లింపుల్లో థర్డ్ పార్టీ యాప్స్ అయిన ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ఇతర వాటిలో కరెంట్ బిల్లు కడితే విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడానికి మూడు రోజుల సమయం పడుతోంది. అలాగే కొన్ని పేమెంట్స్ పలు కారణాలతో నిలిచిపోతున్నాయి. దీంతో ప్రత్యక్షంగా విద్యుత్ సంస్థకు డబ్బులు చేరడంలో ఆలస్యం అవుతోంది. అదే ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో బిల్లు చెలిస్తే నేరుగా సంస్థ ఖాతాలోకే జమవుతుంది. దీంతో యూపీఐ యాప్స్‌లో నగదు చెల్లించినా, నేరుగా ఎస్పీడీసీఎల్ ఖాతాలో జమ కావాలని ఆర్‌బీఐ నిబంధనలు విధించింది. అందులో భాగంగానే యాప్స్ యాజమాన్యాలు పలు అనుమతులు తీసుకోవాల్సి ఉంది.

75 శాతం బిల్లులు ఆన్‌లైన్ ద్వారానే..

ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లో మొత్తం 76,176 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. గృహ వినియోగదారులు 58,189, 4,429 వాణిజ్య సముదాయ కనెక్షన్లు, 280 చిన్న పరిశ్రమలు, 1,103 ప్రభుత్వ కార్యాలయాలు, 12,177 వ్యవసాయ బోరు కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో 60 శాతం ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. మిగిలిన 15 శాతం పరిశ్రమలు,వాణిజ్య సముదాయ విద్యుత్ బిల్లులు బ్యాంకుల ద్వారా చెల్లిస్తున్నారు. మిగిలిన 25 శాతం మంది విద్యుత్ కార్యాలయాలకు బిల్లుల నగదు చెల్లిస్తున్నారు.



ప్రత్యక్ష బిల్లు చెల్లింపు చేయాలని విద్యుత్ శాఖ సమాచార బోర్డు

యాప్ ద్వారా బిల్లులు చెల్లించండి



ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్ లేదా www.a pr pdc .i n వెబ్‌సైట్ ద్వారా చెల్లించాలి. ఫోన్‌పే, గూగుల్ పే,పేటీఎంతో పాటు ఇతర యూపీఐ యాప్స్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం లేదు. వెబ్‌సైట్ ద్వారా బిల్ డెస్క్‌కు అనుసంధానమైన యూపీఐ యాప్స్ నుంచి బిల్లు చెల్లించవచ్చు. వీటితో పాటు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డు ద్వారా కూడా చెల్లించవచ్చు. లేదా మీ పరిధిలోని కరెంటు ఆఫీసుకు వెళ్లి డిమాండ్ నోటీసు చూపితే బిల్లు కట్టించుకుంటారు.

– బాలచౌదయ్య, ఆదోని విద్యుత్ డివిజన్ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్,

మొహర్రం ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

చిప్పగిరి: మండలంలో మొహర్రం వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ మండల ప్రజలకు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పండుగ ప్రారంభం నుంచి ముగిసేంత వరకు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా గ్రామల్లో ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. చివరి రోజు వివిధ వేషధారణలు వేయడం సహజమని, అయితే ఎవరూ ఆయుధాలు ధరించరాదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

ఆలూరు: మొహర్రం పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పండుగ నిర్వహణకు అనుమతులు మంజూరు చేశామని, అయా గ్రామాలను పోలీసులు తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. అల్లర్లకు పాల్పడుతూ రెచ్చగొట్టేవారిపై నిఘా ఉంచామని, ఎలాంటి కార్యక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే మండలంలోని కమ్మరచేడు, ఏ.గోనేహాళ్, హాలహర్వి మండలంలోని కామినహాళ్, గూళ్యం, చింతకుంట, కారుమంచి తదితర గ్రామాలను సమస్యాత్మకంగా గుర్తించి నిఘా ఉంచామని వివరించారు.

గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

తుగ్గలి : వంట గ్యాస్ వినియోగదారులంతా ఈ-కేవైసీ చేయించుకోవాలని స్థానిక ఇండేన్ గ్యాస్ నిర్వాహకుడు హనుమంతరెడ్డి తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, ఉచిత సిలిండర్లు పొందడానికి ఈ-కేవైసీ తప్పనిసరన్నారు. గ్యాస్ బుక్ చేసుకున్న తర్వాత డెలివరీ బాయ్‌కి ఓటీపీ నంబర్ చెబితే సిలిండర్ అందజేస్తారన్నారు. గ్యాస్ పైపు గడువు ముగిసి ఉంటే డెలివరీ బాయ్‌ను సంప్రదించి తగిన ధర చెల్లించి మార్చుకోవాలని చెప్పారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా కార్యదర్శి గోపాల్



మాట్లాడుతున్న గాదిలింగప్ప



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఆదోని సెంట్రల్: సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్టీయూ కార్యాలయంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు రామకృష్ణ అధ్యక్షతన నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. సీపీఎస్ స్థానంలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీపీఎస్‌ను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయడం దుర్మార్గమన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సూర్యుడు, రామాంజనేయులు, వెంకటేశులు పాల్గొన్నారు.

గెజిట్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

ఆదోని సెంట్రల్: జీపీఎస్ అమలు చేయడానికి తీసుకొచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గాదిలింగప్ప డిమాండ్ చేశారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయమని 20 సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నా పాలకులు పట్టించుకోవడంలేదన్నారు. జీవో నంబర్.54 ద్వారా సీపీఎస్ స్థానంలో జీపీఎస్ తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, సభ్యులు మల్లికార్జున, రామాంజినేయులు, నాయకులు నారాయణ, మల్లయ్య, నాగేష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: జీపీఎస్ అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌ను జారీ చేయడం సమంజసం కాదని, దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ రద్దుపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి ప్రభుత్వం నిర్ణయం తీసుకొంటుందని భావిస్తే.. చర్చలే లేకుండా గెజిట్ జారీ చేయడాన్ని ఎస్టీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. యువగళం పాదయాత్రలో 117 జీఓ రద్దుపై నారా లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్‌చేశారు. నాయకులు బసవరాజు, ప్రసన్నరాజు, ఎల్లప్ప, నాగరాజు, రామచంద్ర, వెంకటరాముడు, చిన్న తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి

మద్దికెర : స్థానిక రైల్వే స్టేషన్‌లో గతంలో మాదిరిగానే ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలంటూ కర్నూలు ఎంపీ నాగరాజుకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కిష్టన్న, గ్రామస్తులు వీరేష్, మస్తాన్, మురళి, భాస్కర్, శివ ఆదివారం కర్నూలులో కలిసి వినతి పత్రం అందజేశారు. స్టేషన్‌లో ట్రైన్ నెంబర్ 18047 వాస్కోడగామా - హౌరా ఎక్స్‌ప్రెస్, 17225 హుబ్లీ- విజయవాడ (ప్రస్తుతం నర్సాపూర్ వరకు పొడిగించారు), కాచిగూడ - బెంగళూరు అలాగే హౌరా - వాస్కోడగామా, విజయవాడ- హుబ్లీ, బెంగళూరు- కాచిగూడ రైళ్లు నిలిపేవారన్నారు. అయితే కరోనా మహమ్మారి కారణంగా 20 మే 2020 నుంచి వాటిని ఇక్కడ నిలపడం లేదని దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇక్కడి నుంచి విజయవాడ, గుంటూరు, హుబ్లీ తదితర ప్రాంతాలకు విరివిగా ప్రయాణం చేస్తుంటారని, కావున రైళ్ల నిలపాలని విన్నవించారు. ఇందుకు ఎంపీ సానుకూలంగా స్పందిస్తూ.. రైల్వే అధికారులతో చర్చిస్తామని హామీనిచ్చారు.



ఎంపీ నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

ఆర్థిక సాయం

చిప్పగిరి: మండలంలోని నగరడోణ గ్రామనానికి చెందిన దేగులపాడు మలితప్ప అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి మృతికి సంతాపం తెలిపారు. మృతుడి కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. మృతుడి కుటంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు నాగేంద్ర, నాగప్ప, లోఖనాథ్, వీరాంజనేయులు ఉన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మద్దికెర : స్థానిక పాఠశాలలో 1998లో 10వ తరగతి చదివిన వలి గత నెలలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు, సహచరులు మృతుడి కుటుంబానికి అండగా నిలవాలని తమ వంతుగా ఆదివారం రూ.1,28,000 అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ మిత్రుడి కుటుంబం బాధలో ఉందని, వారి కుటుంబానికి తమ వంతుగా సహాయం చేసి అండగా నిలవాలని ఈ మొత్తం అందజేసినట్లు చెప్పారు.

కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకోండి

గోనెగండ్ల : పంట సాగు హక్కు పత్రాల వలన కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలు పొందే అవకాశాలు ఉన్నాయని, కౌలు రైతులందరూ గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే రైతుతో పాటు కౌలు రైతు నష్టపోతారని, దీని నివారించడానికి పంట సాగు హక్కు పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. కౌలు పత్రం వలన సుఖీభవ, పీఎం కిసాన్, పంటల బీమా, పంట నష్టపరిహారం, సున్నా వడ్డీ, ధాన్యం పండించిన తర్వాత కొనుగోలు కేంద్రాలలో అమ్ముకునే వీలుంటుందని చెప్పారు. కౌలు కార్డుకు దరఖాస్తు చేసుకునే రైతులు భూ యజమాని ఆధార్ కార్డు, వన్‌బీ, అడంగల్, పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్, ఫోన్ నంబర్, ఫొటో, కౌలు రైతు ఆధార్ కార్డు తీసుకొని రైతు సేవా కేంద్రాలలో ఉన్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఎంపీఈఓలను సంప్రదించాలన్నారు.

చదువుకోవాలనే తపన!

తుగ్గలి : ఆదివారం వస్తే చాలు.. పుస్తకాలకు విరామిచ్చేసి..హాయిగా ఆటలాడటం, సెల్‌ఫోన్, టీవీ చూస్తూ సరదాగా గడపటం నేటి విద్యార్థులకు సాధారణమే. అయితే కొందరు మాత్రం తమ కుటంబాలకు అండగా నిలుస్తుంటారు. తమ పెద్దలకు పనుల్లో చేదోడుగా నిలుస్తుంటారు. ఈ చిత్రంలో కనిపిస్తున్న విద్యార్థి రాంపల్లికి చెందిన రాజశేఖర్. పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సమీపంలోనే తాత రంగన్న బంకు పెట్టుకుని తినుబండారాలు అమ్ముకుని జీవనం సాగిస్తుటారు. తాత పని నిమిత్తం వెళ్లడంతో రాజశేఖర్ బంకులో కూర్చొని పాఠాలను నోట్‌బుక్‌లో రాసుకుంటూనే వ్యాపారం చేస్తూ తాతకు సాయమయ్యాడు. చదవాలనే తపన ఉండాలే గాని అవరోధాలు అడ్డంకి కాదు కదా.



పెండేకల్లు రైల్వే జంక్షన్‌లోని ఓ బంకులో నోట్‌బుక్‌లో రాసుకుంటున్న విద్యార్థి

ఘనంగా చిన్న సరిగెత్తు

హొళగుంద: మండలంలో మొహర్రం వేడుకల్లో భాగంగా ఆదివారం రాత్రి చిన్న సరిగెత్తును భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక బాలా మసీదు, చిన్న మసీదు, రాజానగర్ కాలనీ, గరిడిమనే చావిళ్లతో పాటు ఆయా గ్రామాల్లో కొలువైన పీర్లకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే.. మడ్డిలింగదహళ్లీ, సుళువాయి, గజ్జహళ్లీ, హెబ్బటం, ఇంగళదహాళ్ తదితర గ్రామాల్లో రాత్రి పీర్లను గ్రామ వీధుల్లో ఊరేగించారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు

హొళగుంద: మొహర్రం వేడుకల్లో ఎవరైనా వ్యక్తిగత కక్షలను మనస్సులో పెట్టుకొని గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పెద్దయ్య నాయుడు హెచ్చరించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మత సామరస్యానికి చిహ్నంగా జరుపుకుంటున్న వేడుకలను ప్రశాంతంగా జరపుకోవాలని సూచించారు.



హొళగుందలో కొలువుదీరిన పీర్లు

ప్రారంభానికి నోచుకునేనా?

- హైవే-167 పక్కన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం
- రూ.80 లక్షల రూర్బన్ నిధులు వెచ్చింపు
- నాలుగేళ్లవుతున్నా వినియోగంలోకి రాని వైనం
- ప్రభుత్వ ఆదాయానికి గండి

ఆలూరు రూరల్: ఎంపీడీఓ కార్యాలయ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి నాలుగేళ్లవుతున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. 2019లో రూ.80 లక్షల రూర్బన్ నిధులు వెచ్చించి హైవే 167 పక్కన 18 గదుల ఏర్పాటు కోసం పనులు ప్రారంభించి 2021లో పూర్తి చేశారు. అనివార్య కారణాల వల్ల అప్పట్లో ప్రారంభానికి నోచుకోలేదు. షాపింగ్ కాంప్లెక్స్ అందుబాటులోకి వస్తే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే గ్రాంట్స్‌తో పాటు పన్నేతర ఆదాయం సమకూరుతుంది. అద్దెను వినియోగించి మండలంలో పలు అభివృద్ధి పనులు చేపట్టవచ్చు. వ్యాపారులకు సైతం ఈ కాంప్లెక్స్ ద్వారా ఉపాధి లభిస్తుంది. విలువైన ప్రభుత్వ స్థలంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌కు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది. నాలుగేళ్లుగా వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. బహిరంగ వేలాల ప్రక్రియ ద్వారా షాపులను వ్యాపారులకు కేటాయించాలని నిబంధనలు చెబుతున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభిస్తే ఆదాయంతో పాటు పలువురికి ఉపాధి లభిస్తుందని పట్టణవాసులు పేర్కొంటున్నారు.




ఆలూరులో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

అందని ‘ఉపాధి’ వేతనాలు

- 8 వారాలుగా ఎదురుచూస్తున్న కూలీలు

చిప్పగిరి: వలసల నివారణ లక్ష్యంగా అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లోని కూలీలు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే తమ గ్రామల్లో పనులు చేసి 8 వారాలు గడుస్తున్నా ఇప్పటిక వరకు కూలి చెల్లించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 13 గ్రామ పంచాయతీల్లో మొత్తం 7,166 జాబ్ కార్డులు ఉన్నాయి.అందులో సమారు 14,114 మంది వరకు ఉపాధి హామి కూలీలు ఉన్నారు. నిత్యం ఆయా గ్రామాల్లో మొత్తం వెయ్యి నుంచి 1100 మంది వరకు ఉపాధి పనులకు వెళ్తున్నారు. వీరికి రోజుకు రూ. 290 నుంచి రూ.300 వరకు కూలి పడుతోంది. ఎనిమిది వారాలు పనిచేసినా అందుకు సంబంధించిన కూలి సొమ్ము అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని కూలీలు వాపోతున్నారు. వేతనాల గురించి సంబంధిత కార్యాలయాల్లో అధికారులను సంప్రదిస్తే పొంతన లేని సమాధానాలు ఇస్తుండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తునఆనరు. ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు అందేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఉపాధి హామీ పనులు పరిశీలిస్తున్న ఏపీఓ మాధవ శంకర్ (ఫైల్)

చర్మకారులకు ఆరోగ్య బీమా కల్పించాలి

ఎమ్మిగనూరుటౌన్: దుమ్ము, ధూళికి రోడ్లపై కుల వృత్తిని చేసుకొనే చర్మకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య బీమా కల్పించాలని ఏపీ చర్మకారుల సంఘ జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో చర్మకార వృత్తిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వారసత్వంగా వచిన వృత్తిని చేసుకునే చర్మకారులకు ప్రభుత్వం ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పించి వారికి నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘ నాయకులు సుమాల ఆంథోని, భాస్కర్, సుమాల రాజు, గుంటెప్ప, శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ఉచితంగా అందించాలి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామంటున్న ఇసుక విధానం వల్ల ప్రజలకు ఇసుక ఉచితంగా అందించే విధంగా లేదని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ అన్నారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏపీ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంపై ఉన్న గందరగోళాన్ని తొలగించి, ఉచితంగా ఇసుక అందించి భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలన్నారు. ఎన్నికల ముందు ఉచిత ఇసుక పాలసీ తెస్తామని హామీ ఇచ్చారని, ప్రస్తుతం ఉచిత ఇసుక విధానం కనిపించడం లేదన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో గురువులతో పూర్వ విద్యార్థులు

తుగ్గలి : మండలంలోని పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. 2000–05 బ్యాచ్ విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాఠశాల రోజులు జీవితంలో ఒకసారి మాత్రమే వస్తాయని అవి ఎప్పటికీ గుర్తుండి పోతాయన్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. వారి స్థితిగతులు, చేస్తున్న ఉద్యోగాల గురించి ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. తమ వద్ద విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో స్థిరపడటాన్ని చూసి తమ ఆనందాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నామని గురువులు పేర్కొన్నారు. అనంతరం వారు చదువుతున్న రోజుల్లో పాఠాలు బోధించిన గురువులు హుసేన్‌సాహెబ్, బూషప్ప, సురేష్ బాబు, వెంకటరమణ, ఉపేంద్ర, శ్రీనివాసులు, ఎల్లయ్య, కృష్ణయ్య, వెంకమ్మ, ఫిజికల్‌డైరెక్టర్ రంగస్వామిని ఘనంగా సన్మానించారు. పీఎంసీ చైర్మన్ నాగరాజు పాల్గొన్నారు.